నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
06.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
17 ఏప్రిల్ 2024
పేజీలు 8

**మిషన్ దివ్యాస్త్ర**

'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యంతో రూపొందించిన అగ్ని–5 క్షిపణిని డీఆర్‌డీవో మార్చి 11న విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో ఈ క్షిపణిని మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) టెక్నాలజీతో డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఈ క్షిపణి 5,000 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అగ్ని–1 నుంచి అగ్ని–4 క్షిపణులు 700 కి.మీ. నుంచి 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు.

# నాగపూర్ తీర్మానం.. స్వరాజ్య సాధనే లక్ష్యం

## సహాయ నిరాకరణ ఉద్యమం

### నేపథ్యం

- ఖిలాఫత్ తప్పిదాలు, పంజాబ్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ మారణకాండ, దాని అనంతర పరిణామాలు, 1919 మాంటేగ్– చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు (భారత ప్రభుత్వ చట్టం) భారతీయులకు చట్టసభల్లో తగినంత ప్రాతినిధ్యాన్ని ఇవ్వకపోవడం అనే మూడు కారణాలను సాకుగా చూపి గాంధీజీ ఖిలాఫత్– సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు.
- ఈ క్రమంలోనే ఖిలాఫత్ కమిటీ సభ్యుల్లో ఒకరైన మౌలానా షౌకత్ అలీ 1920, ఏప్రిల్‌లో మహాత్మాగాంధీ నేతృత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం మొదలుపెడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. గాంధీజీ కూడా సహాయ నిరాకరణ ఉద్యమం మొదలుపెట్టేందుకే మొగ్గుచూపాడు.
- ఈ విషయంలో గాంధీజీ తిలక్‌ను సంప్రదించగా ఆయన ఏ విషయం తేల్చలేదు. అదే ఏడాది ఆగస్టు 1న తిలక్ మరణించాడు. అయినప్పటికీ మొదట నిర్ణయించినట్టుగానే ఆగస్టు 1 నాడే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ రోజున తిలక్ మృతికి సంతాపంగా ఉపవాసం ఉన్నారు. ఇంకా ప్రదర్శనలు, హర్తాళ్లలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- తర్వాత సెప్టెంబరులో లాలా లజపతిరాయ్ అధ్యక్షతన కలకత్తాలో కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో చిత్తరంజన్ దాస్, అనీబీసెంట్, మదన్ మోహన్ మాలవీయ, మహమ్మద్ అలీ జిన్నా, బిపిన్ చంద్రపాల్ తదితర నాయకులు ఉద్యమాన్ని వ్యతిరేకించారు.
- చివరికి ఉద్యమ ఆమోదానికి నిర్వహించిన ఓటింగులో 1886 అనుకూల, 884 ప్రతికూల ఓట్లు వచ్చాయి. అలా మెజారిటీ మేరకు ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు.

### ఉద్యమ కార్యాచరణ

1) ప్రభుత్వ బిరుదులు, గౌరవ పదవులను త్యజించడం
2) ప్రభుత్వ నిధులను బహిష్కరించడం
3) ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలు, విదేశీ వస్త్రాలను బహిష్కరించడం
4) ఇరాక్‌లో పనిచేసేందుకు ప్రభుత్వం జరుపుతున్న నియామక ప్రక్రియను బహిష్కరించడం
5) చట్టసభలకు జరిగే ఎన్నికలను బహిష్కరించడం
6) ప్రభుత్వ సంస్థలను బహిష్కరించిన వారి కోసం జాతీయ విద్యాలయాల స్థాపన, ప్రజా న్యాయస్థానాల ఏర్పాటు, ఖద్దరు–స్వదేశీ వస్త్రధారణను ప్రోత్సహించడం మొదలైన నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టారు.

### ఉద్యమ ప్రస్థానం

- ఆ తర్వాత డిసెంబరులో నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశంలో సహాయ నిరాకరణ ఉద్యమానికి చిత్తరంజన్ దాస్, లాలా లజపతిరాయ్ తదితర నాయకుల ఆమోదం లభించింది. అలా నాగపూర్ సమావేశంలో దీనికి అధికారికంగా ఆమోద ముద్ర పడింది. ఈ సమావేశంలోనే పన్నుల నిరాకరణ ఉద్యమాలను చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. హిందూ–ముస్లిం ఐక్యతకు పాటుపడాలని కూడా తీర్మానించారు.

**స్వరాజ్య సాధన కోసం 1920–22 మధ్యకాలంలో గాంధీజీ నిర్వహించిన సత్యాగ్రహ ఉద్యమమే సహాయ నిరాకరణ ఉద్యమం. దేశవ్యాప్తంగా భారీస్థాయిలో సాగిన ఈ శాంతియుత పోరాటం తన స్వరాజ్య సాధన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. అయితే, స్వాతంత్ర్య కాంక్షను దేశంలో అన్ని వర్గాల ప్రజలకు, మారుమూల ప్రాంతాలకు చేర్చడంలో విజయం సాధించింది.**

- ఇక సంస్థాగతంగా బలపరిచేందుకు కాంగ్రెస్‌లో కొన్ని మార్పులు చేపట్టాలని నిర్ణయించారు. అవి..

1) కాంగ్రెస్ రోజువారీ వ్యవహారాలను చూసేందుకు 15 మంది సభ్యులతో కార్య నిర్వాహక వర్గం ఏర్పాటు
2) 350 మందితో ఒక అఖిల భారత కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేయడం
3) భాష ప్రాతిపదికన ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీలను పునర్వ్యవస్థీకరించడం
4) జాతీయ, ప్రావిన్షియల్ స్థాయుల లాగే గ్రామాలు, పట్టణాలు, తహసీల్ స్థాయిలో కూడా కాంగ్రెస్ కమిటీలను వ్యవస్థీకరించడం
5) సామాన్యుడికి చేరువయ్యేందుకు కాంగ్రెస్ సభ్యత్వ రుసుమును నాలుగు అణాలుగా నిర్ణయించారు.

- అలా నాగపూర్ సమావేశంతో కాంగ్రెస్ 'రాజ్యాంగబద్ధంగా స్వపరిపాలనను సాధించడం' అనే లక్ష్యం నుంచి 'శాంతియుతంగా, న్యాయమైన మార్గంలో స్వరాజ్య సాధన' తన లక్ష్యంగా మార్చుకొంది. నిర్మాణాత్మక కార్యక్రమాలు, వ్యూహాత్మక దాడితో గాంధీజీ దేశంలో మహోన్నత నాయకుడిగా మారిపోయాడు.
- నాగపూర్ తీర్మానం తర్వాత సహాయ నిరాకరణోద్యమం ఊపందుకొంది. ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొనేందుకు ముందుకు వచ్చారు. ఎన్నికల బహిష్కరణ విజయవంతమైంది. తమకు ప్రభుత్వం ప్రదానం చేసిన బిరుదులను, ఇతర గౌరవాలను వెనక్కి ఇచ్చేశారు.
- మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, రాజేంద్ర ప్రసాద్, రాజగోపాలచారి, టంగుటూరి ప్రకాశం తదితర న్యాయవాదులు తమ వృత్తిని విడిచిపెట్టారు.
- బడులు, కళాశాలలు బహిష్కరించిన విద్యార్థుల కోసం గుజరాత్ విద్యాపీఠ్, బిహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, లాహోర్ జాతీయ కళాశాల లాంటి విద్యాసంస్థలు వెలిశాయి. వీటిలో ఉపాధ్యాయులుగా సుభాష్ చంద్రబోస్, ఆచార్య నరేంద్ర దేవ్, రాజేంద్ర ప్రసాద్, డా. సంపూర్ణానంద్ లాంటివారు పనిచేశారు.

### విజయవాడ సమావేశం

- ఈ క్రమంలో 1921, ఏప్రిల్‌లో జాతీయ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఇందులో కోటి రూపాయలతో తిలక్ స్వరాజ్య నిధిని వసూలు చేసేందుకు కోటిమందిని కాంగ్రెస్‌లో సభ్యులుగా చేర్చాలని, అలాగే ఖద్దరు ఉత్పత్తికి 26 లక్షల చరఖాలను పంచాలని తీర్మానించారు.




- తిలక్ స్వరాజ్య నిధికి అనుకున్న దానికంటే ఎక్కువ స్పందన లభించింది. ఆ తర్వాత కాంగ్రెస్ తన దృష్టిని విదేశీ వస్త్ర బహిష్కరణ వైపు మళ్లించింది. అదే ఏడాది నవంబర్‌లో భారతదేశ సందర్శనకు వస్తున్న వేల్స్ రాకుమారుని పర్యటనను బహిష్కరించాలని కాంగ్రెస్ తీర్మానించింది.

> **మదురై – 1921, సెప్టెంబర్ – అర్ధనగ్న ఫకీరుగా గాంధీ**
>
> - మద్రాస్ నుంచి మదురైకి రైలులో వెళ్తూ ఏమీ పట్టనట్టుగా నేనున్న పెట్టెలోని జనాన్ని చూశాను. వాళ్లంతా విదేశీ దుస్తుల్లో ఉన్నారు. వాళ్లను ఉద్దేశించి ఖద్దరు అవసరాన్ని నేను చెప్పబోయాను. వాళ్లు తమ తలలు అడ్డంగా ఊపి 'మేం చాలా పేదవాళ్లం, మాకు ఖద్దరు ధరించే స్తోమత లేదు' అన్నారు. ఆ మాటల అంతరార్థం గ్రహించాను. వాళ్లు చెప్పింది సత్యమే. దేశంలోని కోట్లాది ప్రజలు ఒక్క గోచితో గడుపుతున్న దృశ్యం నా కళ్ల ముందు మెదిలింది. ఇప్పుడు వాళ్లకు నేనేమని జవాబు ఇవ్వగలను? అందుకే, ఈ దేశ కోట్లాది ప్రజలకు దగ్గరయ్యేందుకు నా ఒంటిమీది దుస్తులను ప్రతి అంగుళమూ వదులుకోవడమే సరైందనిపించింది. మరునాటి ఉదయం మదురైలో సమావేశం తర్వాత నేను అదే పని చేశాను.
>
> —మహాత్మా గాంధీ

- ముస్లింలు బ్రిటిష్ సైన్యంలో చేరవద్దని ప్రకటించడంతో ప్రభుత్వం మహమ్మద్ అలీని నిర్బంధించింది. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన చేపట్టింది. ఆగస్టులో కేరళలో మోప్లాలు ఖిలాఫత్ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలు మతం రంగును పులుముకొన్నాయి.
- నవంబర్‌లో వేల్స్ రాకుమారుడి బొంబాయి పర్యటన హింసాత్మకంగా మారింది. గాంధీ బొంబాయిలో పర్యటించాల్సి వచ్చింది. దీంతో దేశం శాసనోల్లంఘన ఉద్యమానికి సిద్ధంగా లేదని నాయకులు అంచనాకు వచ్చారు. కానీ రాష్ట్రాల్లో మాత్రం స్థానిక నాయకులు శాసనోల్లంఘన ప్రారంభించేందుకు మాత్రం అనుమతిచ్చారు.
- ఉద్యమం తారాస్థాయికి చేరడంతో ప్రభుత్వం అణచివేతకు దిగింది. కాంగ్రెస్, ఖిలాఫత్ కార్యకలాపాలను చట్ట వ్యతిరేకమైనవిగా ప్రకటించింది. చిత్తరంజన్ దాస్, ఆయన భార్య బసంతీదేవి, మౌలానా ఆజాద్, లాలా లజపతి రాయ్, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ తదితర నాయకులను జైళ్లకు తరలించారు. దాదాపు 25,000 మందికి కారాగార శిక్ష విధించారు.
- అహ్మదాబాద్‌లో 1921, డిసెంబర్‌లో జరిగిన వార్షిక కాంగ్రెస్ సమావేశంలో కార్యకర్తలు తమ ఇతర పనులన్నింటినీ వదిలిపెట్టి, పెద్ద ఎత్తున అరెస్టులకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గాంధీజీ కూడా గుజరాత్‌లోని బార్డోలీ తాలూకాలో పన్నుల నిరాకరణ ఉద్యమం మొదలుపెడుతున్నట్లు వైస్రాయ్ లార్డ్ రీడింగ్‌కు 1922, ఫిబ్రవరి 1న తెలియజేశాడు. దీనికి ఏడు రోజుల గడువు విధించాడు.
- ఈ మధ్యలో ఫిబ్రవరి 5న ఉత్తరప్రదేశ్‌లోని చౌరీచౌరాలో ఓ దుర్ఘటన జరిగింది. అక్కడి రైతులు ఊరేగింపు నిర్వహిస్తుంటే స్థానిక పోలీసులతో గొడవ జరిగింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. రైతులు ప్రతీకార చర్యకు పాల్పడ్డారు. పోలీసు స్టేషన్‌ను తగులబెట్టి 23 మంది పోలీసులను చంపేశారు.
- చౌరీచౌరా సంఘటనతో గాంధీజీ ఫిబ్రవరి 11న ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాడు. దీన్ని కాంగ్రెస్ కూడా ఆమోదించింది. ఫిబ్రవరి 22న గాంధీజీని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. మార్చి 18న ఆయనకు ఆరేండ్ల జైలు శిక్ష విధించారు.

### అనంతర పరిణామాలు

- గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించగానే కాంగ్రెస్ నాయకులు, చరిత్రకారుల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ ఈ నిర్ణయం పట్ల విస్మయం ప్రకటించారు. బోస్ దీన్ని 'జాతీయ విపత్తు' అని పేర్కొన్నాడు. మార్క్సిస్టు చరిత్రకారుడు రజనీ పామీదత్ దీన్ని 'వర్గపరమైన' నిర్ణయమే తప్ప, హింస–అహింసకు సంబంధించింది కాదని విమర్శించాడు.
- మరికొంత మంది దీన్ని... చౌరీచౌరా సంఘటన వల్ల ఉద్యమం అలానే కొనసాగితే దేశంలో బ్రిటిష్ వారి దమనకాండ మరింత పెరుగుతుంది కాబట్టి విరమణ గాంధీజీ వ్యూహంలో భాగమని పేర్కొన్నారు. అయితే గాంధీజీ మాత్రం దీన్ని వ్యూహంగా కాకుండా, గమ్యానికి చేరుకునే మార్గం సరిగ్గా ఉండాలని భావించాడు.
- విమర్శలను అలా ఉంచితే జాతీయోద్యమం మరింత ముందుకు వెళ్లేందుకు సహాయ నిరాకరణ ఉద్యమం దోహదం చేసిందన్నది కాదనలేని నిజం. విదేశీ వస్త్ర బహిష్కరణ వల్ల బ్రిటన్ నుంచి దిగుమతులు బాగా తగ్గిపోయాయి. ఖద్దరు ఉత్పత్తి పెరిగింది. గ్రామాల పునర్‌నిర్మాణ భావన దేశమంతా వ్యాపించింది.
- సామాజికంగా చూస్తే సహాయ నిరాకరణ ఉద్యమం హిందూ–ముస్లిం ఐక్యత, అంటరానితనం రూపుమాపడానికి ప్రాధాన్యం ఇచ్చింది. మహిళలు పెద్ద ఎత్తున స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం ఇక్కడి నుంచే మొదలైంది. అన్ని ప్రాంతాలు, అన్ని భాషల వాళ్లు, రైతులు, దళితులు, ఆదివాసులు అందరూ ఉద్యమంలో ప్రవేశించారు. అంతే కాదు సహాయ నిరాకరణ ఉద్యమానికి సమాంతరంగా దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థానికంగా ఉద్యమాలు జరిగాయి.
- రాజకీయంగా కూడా సహాయ నిరాకరణ ఉద్యమం సత్ఫలితాలనే ఇచ్చింది. స్వరాజ్య నినాదం గడపగడపకూ చేరుకుంది. ప్రజలకు సత్యాగ్రహం అనే కొత్త ఆయుధం దొరికింది. ఎంతోమంది యువకులు, మహిళలు జాతీయ రంగస్థలం మీదికి వచ్చారు. అంతేకాదు దేశ స్వాతంత్ర్యం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడ్డారు.

### చౌరీ చౌరా ఉదంతం

- చౌరీ చౌరా గ్రామం ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలో ఉంది. విదేశీ వస్త్ర బహిష్కరణ, మద్యం దుకాణాల ముందు పికెటింగ్ వల్ల స్థానిక భూస్వామికి నష్టం వాటిల్లింది. దీంతో ఆయన పోలీసుల సాయం అర్థించాడు. వారు శాంతియుతంగా పికెటింగ్ నిర్వహిస్తున్న కార్యకర్తలపై లాఠీలతో విరుచుకుపడ్డారు. ఇది తెలిసిన చుట్టుపక్కల ఊళ్ల జనం చౌరీచౌరా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను అలా ఎందుకు చేశారని ప్రశ్నించారు.
- ఈలోపు రెండు వర్గాల మధ్య రాజీ కుదరడంతో వారంతా వెనుదిరిగారు. ఇంతలో పోలీసులు వెళ్లిపోతున్న గుంపుపై కాల్పులు జరిపారు. జనంలో ఇద్దరు చనిపోగా, కొంతమంది గాయపడ్డారు. దాంతో జనం రాళ్లదాడికి ఒడిగట్టడంతో పోలీసులు స్టేషన్ లోపలికి వెళ్లి తలుపులు మూసుకున్నారు. శాంతించని ప్రజలు స్టేషన్‌కు నిప్పంటించారు. ఈ ఘటనలో 23 మంది పోలీసులు మరణించినట్లు తెలుస్తుంది.

- స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన రాజాజీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, మౌలానా ఆజాద్, రాజేంద్ర ప్రసాద్, ఆచార్య నరేంద్ర దేవ్, జయప్రకాశ్ నారాయణ్, బిధాన్ చంద్ర రాయ్, టంగుటూరి ప్రకాశం, గోబింద వల్లభ్ పంత్ తదితర నాయకులంతా సహాయ నిరాకరణ ఉద్యమం నుంచి ఉద్భవించినవారే.
- సాంస్కృతికంగా చూస్తే జాతీయ విద్యాసంస్థలు నెలకొన్నాయి. స్వదేశీ స్ఫూర్తి దేశమంతా వ్యాపించింది. తన సరళమైన జీవన విధానంతో గాంధీజీ సామాన్యుల పాలిట దేవుడిగా మారిపోయాడు. జనం ఆయన పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారు. అందుకే జాతీయోద్యమంలో సహాయ నిరాకరణ ఉద్యమం ఒక మైలురాయిలా నిలిచిపోతుందనడంలో సందేహం అవసరం లేదు.

సంకలనం
**హర్షవర్ధన్ చింతలపల్లి**